కథ

# మమేకం




## కొలనుపాక మురళీధరరావు

రాజయ్య కోడి కూయడంతోనె లేచి దున్నపోతులను తోలుకుంటూ 'గొల్లోని బాయి'కాడ్కి పోయి, మోటబొక్కెనతొండం సరిచేసుకొని కాడికి దున్నపోతులను కట్టి నారాయణో ఓ ఆదినారాయణో మమ్మేలుకో ఓ హరినారాయణ" పల్లెపదం మొదలుపెట్టి మోట కొట్టడం మొదలుపెట్టిండు. ఆయన పాట చుట్టుపక్కలకు కంచు మోగినట్టు వినిపిస్తూంది. అరవైఏళ్లు దాటినా మనిషి ఇనుపచువ్వమాదిరిగ ఉంటడు. రెండెకరాల పొలం బాయికింద, ఐదెకరాల చెల్కబాయికానుకొని ఉంది. ఇది తన తాతలు తండ్రి నుంచి వచ్చిన ఆస్తి. అందుకే ఈ బాయికాడనే ఎక్కువకాలము గడుపుతుంటడు రాజయ్య. తాను అంతో ఇంతో కూడపెట్టి తన కొడుకులిద్దరిని పెంచుతున్నడు. పెద్దోడ్కి అయిన సంబంధం గుణవంతురాలైన పిల్లనే దొరికింది. కోడలుపిల్ల కూడా బాగానే చూసుకుంటుంది. అటు మరిదిని ఇటు మామకు కష్టం కలుగకుంట చూస్తది. పెద్దకొడుకు రాజశేఖరం అదృష్టవంతుడే. గుణవంతురాలైన

పెళ్ళాం దొరికింది. కాయకష్టం చేస్తది. మొగుడ్ని చంటోడ్ని చూసుకుంటది. ఇగ రెండవ కొడుకు ఎవసాయం మీద ఇష్టం లేదు నే చదువుకుంట అంటే నీ ఇష్టం మురళీ అన్నడు. అన్న రాజశేఖరం మరి తండ్రి కూడా సరే అన్నాడు. పెద్దోడు తోటపని చూసుకుంటు దాన్ని ఏటా ఏటా పెంచి పెద్దది చేస్తూ ఫలసాయం మీద అంతో ఇంతో సంపాదిస్తున్నడు. రెండోడు మురళీ పట్నంలో పెద్దచదువే చదువు తున్నడు. ఆర్నెల్లకో మారు ఊర్కి వచ్చి తండ్రిని, అన్న వదిన పిల్లలని చూస్తుంటడు.

దాపట దున్నపోతు నిన్నటి నుండి కుంటు తూంది. మోటకొట్టిన తరువాత పశులదవాఖానాకు పోయి చూపించాలి. పదిమైళ్ళు తడిసినై. పొద్దెక్కు తూంది. దున్నపోతులను కాడినుండి విప్పి మోట బొక్కెన పక్కకు పెట్టి తొండం చూస్తుంటే అక్కడక్కడ చిల్లులు పడ్డట్టున్నవి. పాతబడ్డది. ఈయాసంగి అయింతర్వాత కొత్త తొండం కొంటే మరో రెండు కార్లకు వస్తూంది అనుకున్నాడు రాజయ్య. దున్నపోతు మీద చేయి వేసి చూసిండు ఒళ్ళు వెచ్చగుంది. పశువుల డాక్టర్‌కు తొందరగనే చూపించాలె ఆడ్కిపోతే మందో మాకో ఇస్తరు. చుట్టతాగుకుంటూ ఇంటిముఖం పట్టిండు.

“నాయినా ఇంకెన్నాళ్ళు ఈ మోట వ్యవసాయం హాయిగ కరెంటు మోటరు పెట్టుకుంటె గబగబా పనైపోతూంది గదా అన్నాడు రెండో కొడ్కు మురళి. చూడు బిడ్డా నా తరం ఈట్టాగె సాగిపోనీ కరెంటు మోటర్కు మనబాయి తట్టుకోలేదు. బుడబుడ బాయిలోని ఊటను ఇట్టే లాగుతూంది. మరి మళ్ళు తడికూడా సరిగ్గా కాకుండానే నీరు పారుతూంది. అయినా కరెంటు ఎప్పుడొస్తదో ఎప్పుడు పోతదో తెలియదు మరి బిల్లు తలమోపెడు. హెల్పర్‌కు, లైను మనిషిని కలుపుకోవాలంటే మన రెండెకరాలకు ఇంత కష్టమెందుకు ? మనకు ఖర్చులు బోగా కార్కు నాలుగు పుట్లు మిగులుబాటు అవుతున్నయి గదా. ఎరువు, మట్టి మనదొడ్లోది ఇంకా మన పటేలు దొడ్లో సరిపోతూంది. నీవేం ఫికర్ చేయ్కు నీ సదువు సూసుకో. అన్నాడు మురళితో భుజం మీద చేయి వేస్తూ ఇంట్లో ఉన్న మంచం మీద కూర్చుంటూ. దవాఖానాలో దున్నపోతును చూసి “గాళ్ళు పోసినై మూడు రోజుల్లో తగ్గుద్ది” అంటూ సూదిమందు కూడా వేసిండు పశువుల డాక్టరు.

చెల్కలోనె కందులు, మధ్య మధ్య గోంగూర యాపచెట్ల మీదికి రాగిచెట్టు మీదికి యానపకాయ బీరపాదు ఇంగ తన ఇంట్లో కాకరపాదు, కొత్తిమీర, పూదినా మళ్లు ఉండటం వల్ల ఇంట్కి సరిపోయె కూరగాయలు ఆకుకూరలు కాక ఇరుగుపొరుగుకు కూడా అప్పుడప్పుడు పంపిస్తాడు.

**పంటచేతికి వచ్చింది. రైతు బిడ్డకు కావల్సిందదే కదా. సంతోషంతో కల్లం సాపుచేయించి వడ్లు తూర్పారపట్టించి కుప్పపోసి అందులోనుంచి ఒక కుంచెడు వడ్లు గట్టుమీద హనుమంతునికోసం తీయించి మిగతా కమ్మరి, కుమ్మరి, చాకలి, మంగలి తొండంకు గట్టేవాళ్ల వంతులు ఇచ్చి బీద బిక్కులకు కళ్ళం వడ్లు పరగెలు ఇప్పించి హనుమంతుల సామ్కి పులికాపు చేయించి అయ్యగారితో పులిహోర చేయించే సర్కి సూరీడు పడమటతల్లి గర్భంలో పోతుండు.**

కాలంలో మార్పులు వస్తున్నా తన జీవితంలో మార్పేమి లేదు. ముసల్ది చచ్చి ఏ లోకంలో వుందో గాని అది ఉన్నప్పుడు ఉన్నట్టే తన పిల్లలు తనను చూసుకుంటున్రు. ఇంక తనకేం కావాలి? తన పాతకాలపు అలవాటుతోనే ఈ బతుకుబండి సాగిపోతూంది. అంతా భగవంతుని దయ. రాజయ్య స్వతహాగ మెతకమనిషి తన ఎవసాయం, తన దొడ్డి తన గొడ్లు తన కుటుంబం. ఎవరి జోలికి పోయేటోడు కాదు. ఎవరైనా ఏదైనా సలహా అడిగితే తనకు తోచింది చెబుతాడు. అందుకే రాజయ్య అంటే ఆ వూర్లో సాత్వికుడని రాజర్షియని అంటుంటారు.

పంటచేతికి వచ్చింది. రైతు బిడ్డకు కావల్సిందదే కదా. సంతోషంతో కల్లం సాపుచేయించి వడ్లు తూర్పారపట్టించి కుప్పపోసి అందులోనుంచి ఒక కుంచెడు వడ్లు గట్టుమీద హనుమంతునికోసం తీయించి మిగతా కమ్మరి, కుమ్మరి, చాకలి, మంగలి తొండం కుట్టేవాళ్ల వంతులు ఇచ్చి బీద బిక్కులకు కళ్ళం వడ్లు పరిగెలు ఇప్పించి హనుమంతుల సామ్కి పులికాపు చేయించి అయ్యగారితో పులిహోర చేయించే సర్కి సూరీడు పడమటతల్లి గర్భంలోకి పోతుండు. తన కష్టాన్కి తగిన పంట వచ్చిందని తృప్తిపడి అందరికి పులిహోర పంచి తాను తన ఇంట్కి మూటగట్టుకొని భర్తి బండ్లమీద తన పెద్దకొడుకు రాజశేఖరికొడ్కు తన ముద్దుల మనుమడు రాజయ్య పాతపేరు మార్చుకొని రాజేశ్‌గా ఈ మధ్యనే మారిండు వాడ్ని బండ్లమీద కూకుండే నా సామిరంగా ఏనుగుమీద ఎక్కిన యువరాజులా ఉన్నాడు తన మనుమడని మనస్సులో ఎంతో ఉప్పొంగిపోయింది తాత మనసు. ఈ బతుక్కి ఈ అదృష్టం చాలు అనుకుంటూ కుంగిపోతున్న సూరీడు కేసి చేతులు ఎత్తి దండం పెట్టి సీతారాముల పెళ్ళికి తాను పెళ్ళి పెద్దగ ఒక తూమెడు వడ్లు కొలిపించాలి. ఆ సీతారాముల కళ్యాణం చూస్తే తన జనుమ తరించినట్టే. ఆకాశంలో మబ్బు తెరలు చూస్తూ యాపచెట్టు కింద ఉన్న కాళ్ళ మంచం వేసుకుని చుట్ట కాల్చుకుంటూ మమేకం చెందుతున్న రాజయ్యను చూస్తుంటే అచ్చం కర్మయోగిలా లేదూ అని ఆ వూర్లో కరణం పంతులు అంటుంటాడు.

ఆ పెద్ద మనిషికి ప్రపంచీకరణ గురించిగాని, నడుస్తున్న రాజకీయ బాగోతం గూర్చి తెలియదు. దాని గురించి పట్టించుకోడు కూడా. ఎవరి బతుకు వారిది. ఎవరి తత్వం వారిది అనుకుంటూ తన వంశోద్ధారకునితో ఆడుకుంటూ కాలక్షేపం చేస్తుంటాడు. పక్కా గ్రామీణ జీవితాన్ని అలవరచుకున్న రాజయతాత అంటే రాజేశ్కే గాక ఆ వూర్లోని వాళ్ళందరికి గౌరవంగ చేతులు ఎత్తి దండం పెట్టాలనిపిస్తుంది. తరం మారుతున్నా ఆ తరం మనిషి తరతరాల సంస్కృతిని ఆకళించుకున్న రాజయ్య.

వూళ్ళోని రాములోరి గుడి అందంగ తయారైంది. చుట్టు పక్కల వూళ్ళ నుండి భజన మండలి వారు వస్తున్నారు. ఇంగ మూడురోజుల్లో సీతారాముల కళ్యాణముందట. తన జనుమకు ఆ దేవుని కార్యం చూస్తె చాలు ఒళ్ళు పులకరిస్తూంది. రోజులు త్వరగా గడచిపోతున్నవి. శ్రీరామనవమి వచ్చింది. అందరూ హడావిడిగా ఉన్నారు. తాటాకుల పందిళ్ళు వేసిండ్రు. బెల్లం పానకం చేసిన్రు, వడపప్పు చేసి, సీతారాములను కళ్యాణమంటపంలోకి తీసుక వచ్చిన్రు. గోవిందా గోవిందా నామాల శ్రీరామ చంద్రుడు సీతమ్మ మెళ్ళో తాళి కట్టిండు. తన పెళ్ళి కూడా ఇదేరోజు జరిగింది. ఈడనే ముసల్ది సీతమ్మ మెళ్ళో తాను కట్టిన పుస్తె గట్టిగుండబట్టే తాను ఇంకా మిగిలిపోయుండు అదేమో తన కన్న ముందే పోయింది ! తలంబ్రాలు పడ్డాయి. తాను కూడా చేతులు ఎత్తి శ్రీరామ శ్రీరామ అంటూనే అంటే.... ఆ చేతులు అలాగే ఉండిపోయాయి...